క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నవీపేట: పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులు కావడంతో మండలంలోని కమలాపూర్ గ్రామంలో పార్టీ కార్యకర్తలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడారు. పార్టీ తనపై ఉన్న నమ్మకంతో కార్యకర్తలతో కలిసి పని చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూషణ్, ఆంజనేయరెడ్డి, సోమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు



కమ్మర్‌పల్లి: అనారోగ్యం బారిన పడి వైద్య ఖర్చులు భరించే ఆర్థిక స్తోమత లేని బాధితులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అండగా నిలిచారు. కమ్మర్‌పల్లి మండలం హసకొత్తూర్ గ్రామానికి చెందిన సీహెచ్. వరలక్ష్మి అనే మహిళకు గుండె సంబంధిత వ్యాధికి శస్త్ర చికిత్స అవసరమైంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి. ఈ విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎల్‌వోసీ మంజూరు చేసి బాధితురాలి భర్త గంగాధర్‌కు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు.

నూతన బైక్ ఆవిష్కరణ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని లక్ష్మి హీరో మోటో కార్పొరేట్ కార్యాలయంలో గురువారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు నూతన బైక్‌ను ఆవిష్కరించారు. అధునాతన టెక్నాలజీతో ప్యాషన్ ప్లస్ టూ వీలర్ బైక్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని లక్ష్మి మోటార్స్ యజమానులు సాయికృష్ణారెడ్డి తెలిపారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో నాగవర్ధన్, సురేష్‌బాబు, కొత్తూర్ రాజేశ్వర్, దశగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన నిత్యశ్రీ నీట్ పరీక్షలో 646 మార్కులు సాధించడంతో పద్మశాలి సంఘం సభ్యులు రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం శాలువతో సత్కారించారు. ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మ్యాక గంగాధర్ మాట్లాడుతూ.. జిల్లా నుంచి మన పద్మశాలి ప్రతినిధి నిత్యశ్రీ, నీట్‌కు క్వాలిఫై కావడం చాలా గర్వకారణమన్నారు. మంచి స్పెషలైజేషన్ డాక్టర్‌గా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి చెన్న రవికుమార్, ఇట్టెం జీవన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భరోసా ఏదీ ?

ఆర్మూర్‌టౌన్: బాసర ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులకు భరోసా ఎక్కడ ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి గురువారం ప్రశ్నించారు. బాసర ట్రిపుల్ ఐటీలో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు అనుమానాస్పదంగా మరణించడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి, స్థానిక జిల్లా మంత్రి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ ఘటనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల అందజేత

రుద్రూర్: అక్బర్‌నగర్‌లో జైజవాన్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు గురువారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రశంసిస్తూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. గ్రామ సర్పంచ్ తిగుళ్ల గంగామణిప్రసాద్, జీపీ కార్యదర్శి గంగారాం, జైజవాన్ ఆర్మీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని సిద్ధి వినాయక ఎస్‌ఎల్‌ఎఫ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి నెలా గుప్పెడు బియ్యం కార్యక్రమంలో భాగంగా పేదలకు బియ్యం అందజేస్తున్నారు. పేదలకు తమవంతుగా బియ్యం అందజేయడం సంతోషంగా ఉందని ఎస్‌ఎల్‌ఎఫ్ సంఘం సభ్యులు తెలిపారు. ఎస్‌ఎల్‌ఎఫ్ సభ్యులు గంగామణి, శిరీష, సుజాత, రూప, పల్లవి, సుమలత పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపిస్తే చర్యలు

ఆర్మూర్‌టౌన్: పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై నడిపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంవీఐ వెంకటస్వామి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌లలో గురువారం పలు పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. పాఠశాల బస్సు అన్ని విధాల కండీషన్‌లో ఉండాలని సూచించారు. లేని పక్షంలో బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఇంటింటి ఓటర్ల సర్వే

- డొంకేశ్వర్ మండల పరిధి గ్రామాల్లో తిరుగుతున్న బీఎల్వోలు
- మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డొంకేశ్వర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు సర్వేను నిర్వహిస్తున్నారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లలో మార్పులు, చేర్పులు, కొత్తగా నమోదు, మరణించిన వారి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఇంట్లో ఎంత మంది ఉన్నారు..? స్థానికంగా ఉంటున్నారా..? వేరే ప్రాంతాలకు వెళ్లారా..? అనే వివరాలతో పాటు కొత్త ఓటరుగా నమోదయ్యేవారు ఎవరైనా ఉన్నారనే విషయాలను తెలుసుకుంటున్నారు. 2019 ఎన్నికల సమయంలో ఓటరు జాబితాతో పోల్చి చూసి ఎక్కడైనా ఓటర్ల సంఖ్య తగ్గితే అందుకు గల కారణాలను పరిశీలిస్తున్నారు. ఈ సర్వేను ఈ నెల 23 నాటికి ముగించి ప్రత్యేక ప్రొఫార్మా ద్వారా కలెక్టరేట్‌కు నివేదించనున్నారు. డొంకేశ్వర్ మండల పరిధిలో 15 గ్రామాలుండగా, 19 పోలింగ్ స్టేషన్‌లున్నాయి. బీఎల్వోలు గ్రామాల్లో తిరిగి చేపట్టిన సర్వే వివరాలను పోలింగ్ స్టేషన్ల వారీగా రోజూ తహసీల్ కార్యాలయంలో అందజేస్తున్నారు. మరణించిన ఓటర్ల వివరాలను జాబితా నుంచి తొలగించి తుది నివేదికను కలెక్టరేట్‌కు పంపనున్నారు. ఈ సర్వే ద్వారా కుటుంబ సభ్యులందరూ ఒకే బూత్‌లో ఓటరుగా ఉండేందుకు అవకాశం ఏర్పడనుంది.



మారంపల్లిలో ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను తెలుసుకుంటున్న బీఎల్వో

మండలంలో గ్రామాల వారీగా తాజా ఓటర్లు

గ్రామం	పురుషులు	మహిళలు	మొత్తం
దత్తాపూర్	530	671	1,201
తొండాకూర్	466	560	1,026
మారంపల్లి	735	924	1,659
గంగాసముందర్	310	359	669
నూత్‌పల్లి	980	1,154	2,134
గాదెపల్లి	378	411	789
జీజీ నడ్కుడ	618	719	1,337
సిర్పూర్	409	515	924
అన్నారం	249	516	945
డొంకేశ్వర్	1,447	1,554	3,001
నికాల్‌పూర్	711	851	1,562
కోమట్‌పల్లి	193	240	433
మొత్తం:	7,206	8,474	15,680

తప్పుల్లేని జాబితానే లక్ష్యం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేను పది రోజుల్లో పూర్తి చేసి కలెక్టరేట్‌కు పంపుతాం. కొత్త ఓటర్ల నమోదుతో పాటు తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తాం.

– రవీందర్ నాయక్, తహసీల్దార్, డొంకేశ్వర్

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

బాల్కొండ : ప్రధాన రోడ్ల వెంట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎలాంటి కంచె కూడా ఏర్పాటు చేయలేదు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకోకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముప్కాల్ మండల కేంద్రం నుంచి మెండోరా మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో మూల మలుపు వద్ద, వెల్కటూర్ నుంచి తండాకు వెళ్లే రోడ్డు పక్కన మూల మలుపు వద్ద, నాగంపేట శివారులో పెద్దవాగు రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల ట్రాన్స్‌కో సెక్షన్‌లలో లైన్ మెన్‌లు చాలా చోట్ల స్థానికంగా ఉండటం లేదనే విమర్శలున్నాయి. కరెంట్ సరఫరాలో ఎలాంటి సమస్య వచ్చినా స్థానిక మెకానిక్‌లపై ఆధారపడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముప్కాల్ నుంచి మెండోరా వెళ్లే మార్గంలో మూల మలుపు వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



నాగంపేట్ శివారులో పెద్ద వాగు రోడ్డు పక్కన ..

ఆన్‌లైన్ క్విజ్‌లో యువత పాల్గొనాలి

బోధన్‌టౌన్(బోధన్): హైదరాబాద్ యూత్ డిక్లేరేషన్ స్ఫూర్తితో ఈ నెల 18న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జిల్లాలోని యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి సుదర్శన్ రెడ్డి కోరారు. గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణ పార్టీ కార్యాలయంలో క్విజ్ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడారు. యువతీ యువకుల్లో నైపుణ్యతను వెలికి తీయడానికి ఈ ఆన్‌లైన్ క్విజ్ పోటీ ఉపయోగపడుతుందన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కమ్మర్‌పల్లి: హైదరాబాద్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోనాపూర్‌లో ఆన్‌లైన్ క్విజ్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనే వారు 7661899899 నంబర్‌కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

- మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెహ్రూనగర్ గ్రామ పరిధిలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్ సిలిండర్, రూ.2 లక్షల రుణమాఫీ ఇచ్చి తీరుతామన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హుందాన్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు అవకాశం కల్పించండి

రెంజల్(బోధన్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో గురువారం కార్యకర్తలు, రైతులతో సమావేశమయ్యారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకవచ్చేందుకు కాంగ్రెస్‌కు అవకాశం కల్పించాలని కోరారు.



నెహ్రూనగర్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

గోవుల అక్రమ రవాణ నియంత్రించాలి

రుద్రూర్: గోవుల అక్రమ రవాణాను నియంత్రించాలని బజరంగ్ దళ్, గోరక్ష సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం రుద్రూర్ తహసీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చట్టాన్ని ఉల్లంఘించి గోసంతతి అక్రమ రవాణ జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోలు, లారీలలోనే కాకుండా కంటైనర్‌లలో కూడా రవాణా చేస్తున్నారని, నిఘా ఏర్పాటు చేసి అరికట్టాలని కోరారు.

గో హత్యలను ఆపాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం గోరక్ష ఆధ్వర్యంలో బక్రీద్ సందర్భంగా గోవులను వధించకుండా చూడాలని ఎస్సై శివరాం నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణ సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు.



రుద్రూర్ తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తూ..

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్, టీచర్లు

బోధన్‌టౌన్(బోధన్): రాకాసీపేట్ ప్రభుత్వ పాఠశాలలో కేవీ రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి హాజరై విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడారు. ప్రతీ విద్యార్థి శ్రద్ధతో చదువుకోవాలని, చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు మెంబర్ కేవీ ప్రభురెడ్డి, కౌన్సిలర్‌లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈశ్వర్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు..

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన గంధం సాయిబాబా ఈ నెల 8న అనారోగ్యంలో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు గోసంగి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర వస్తువులను అందజేశారు. నెలరోజులకు అవసరమైన వస్తువులను అందించామని, అండగా ఉంటామని పేర్కొన్నారు.

సంక్షిప్తం

స్ట్రాంగ్ రూమ్‌లకు స్థల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్ట్రాంగ్ రూములకు స్థలాన్ని పరిశీలించామని నిజామాబాద్ ఆర్డీవో, ఆర్మూర్ ఇన్‌చార్జి రవి తెలిపారు. అందులో భాగంగానే పట్టణంలోని మార్కెట్‌యార్డును, డిగ్రీ కళాశాలను ఆయన పరిశీలించారు. గత ఎన్నికల సమయంలో ఎన్నికల సామగ్రి పంపిణీకి డిగ్రీ కళాశాలను తీసుకున్నారని, అదేవిధంగా ఈ సారి కూడా డిగ్రీ కళాశాలను తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్, ఆర్‌ఐ అశోక్ సింగ్, సర్వేయర్ రాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం పాఠశాలకు దాతల సహకారం

మోర్తాడ్: పాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు దాతలు సహకారం అందించారు. అమెరికాలో స్థిరపడిన సుంకం కుటుంబ సభ్యులు తాము చదువుకున్న పాఠశాలకు రూ.2,33,460 విలువ చేసే డెస్క్ బెంచీలను అందించారు. సుంకం రాములు, అండాలమ్మల జ్ఞాపకార్థం పాఠశాలకు బెంచీలను అందించారు. సుంకం కుటుంబ సభ్యులలో ఒకరైన రాజేశ్వర్, వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్, సర్పంచ్ ఏనుగు సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు చేస్తే ఊరుకోం

భీమ్‌గల్: మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని బీఆర్‌ఎస్ పార్టీ భీమ్‌గల్ పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్యలు వ్యాఖ్యానించారు. పట్టణ కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు దొన్కంటి నర్సయ్య మాట్లాడుతూ.. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రి కుటుంబీకులపై బీజేపీ నాయకుడు మల్లికార్జున్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

బీసీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కృషి

- బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్: రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. గురువారం పట్టణంలోని తట్టికోట్ కాలనీలో నిర్మించిన రెడ్డికా కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. 2014కు ముందు, ఇప్పుడు బోధన్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలన్నారు. రాష్ట్రంలో గుడి లేని ఊరు లేదు బీఆర్‌ఎస్ పథకాలు అందని ఇళ్లు లేవని, ఇది నిజం కాకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. బోధన్‌లో రెడ్డికా సంఘం భవనం నిర్మాణం కోసం ఎకరం స్థలం, రూ.50లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణాలకు రూ.3 లక్షలు అందిస్తామన్నారు.



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుట్టు మిషన్ల పంపిణీ..

కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేస్తున్న 127 మంది ఆడపిల్లలకు ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే షకీల్ కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

నవీపేట మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన కురుమ, మత్స్యకార కులానికి చెందిన యువకులు ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం

రెంజల్(బోధన్): కేసీఆర్ నాయకత్వం ప్రస్తుత సమయంలో దేశానికి అవసరముందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ అన్నారు. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా విస్తరించిన తర్వాత తనకు సీఎం కేసీఆర్ మహారాష్ట్ర బాధ్యతలను అప్పగించారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పలు ప్రదేశాలు తిరిగి అక్కడి రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకుంటే వారి కన్నీళ్ల నుంచి రక్తం వస్తుందని వాపోయారు. మండలంలోని సాటాపూర్‌లో గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను దేశ వ్యాప్తం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. వచ్చే నెల 2 నుంచి గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవం



నందిపేట పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



సాలంపాడ్‌లో కార్మికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



అడవి మామిడిపల్లిలో .. ఎంపీడీవో క్రాంతి



పిప్రిలో ..జీపీ పాలకవర్గం



వేల్పూర్‌లో పల్లెప్రగతి ర్యాలీ



డొంకేశ్వర్‌లో .. సర్పంచ్ చాయిచందు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పలు చోట్ల బతుకమ్మ, బోనాల వేడుకలు నిర్వహించారు. గ్రామసభలు ఏర్పాటు చేశారు. పల్లెప్రగతి అభివృద్ధి పనులపై ర్యాలీలు నిర్వహించి ఫొటోలు ప్రదర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్

సమాచారం..

20న మండల సర్వసభ్య సమావేశం

నవీపేట: స్థానిక ఎంపీపీ సంగెం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాజిద్ అలీ గురువారం తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మోడల్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని మోడల్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో ఉన్న ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ తెలిపారు. ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 8, బైపీసీలో 10, సీఈసీలో 12 ఖాళీలు ఉన్నాయన్నారు. ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాని కోరారు. మరిన్ని వివరాలకు 9550469917 సెల్ నంబరును సంప్రదించాలని తెలిపారు.

మైనారిటీ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

రుద్రూర్: కోటగిరి మైనారిటీ రెసిడెన్షియల్ (బాలుర) జూనియర్ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో ఎస్టీ–2, ఓసీ –2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు 17లోపు కళాశాలలో సంప్రదించాలన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 7.25, 11.25, 3.10 ది ఫ్లాష్ – 6.55, 10.05
స్క్రీన్-2 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-4 –	ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



పెర్కిట్(ఆర్మూర్): అంగన్వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పెర్కిట్ ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో భార్గవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ అంగన్వాడీ అధ్యక్షులు చంద్రకళ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడారు. ఆర్మూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని తరలించడానికి అయిన హమాలీ వ్యయాలు 3 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే కార్గో బస్సు ద్వారా వచ్చే ఆహార పదార్థాలను అక్కడి నుంచి ఇతర వాహనాల ద్వారా కేంద్రాలకు తరలించాలన్నారు. దీంతో పాటు పాడైపోయిన వంట సామగ్రి స్థానంలో కొత్తవాటిని ఇప్పించాలని కోరారు. పెండింగ్ టీఏ, డీఏ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అంగన్వాడీ యూనియన్ సెక్టార్స్ లీడర్స్ గోదావరి, జగదాంబ, లక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.